ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఫిబ్రవరి
2025



# హరీష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆకట్టుకున్న నృత్యాలు




యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ప్రముఖ డాన్స్ మాస్టర్ హరీష్ ఆధ్వర్యంలో పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో కూచిపూడి నృత్యాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుష్పాంజలి... నరసింహ అవతార కథ, కృష్ణం కలయ సఖి, పిడికిత తలంబ్రాల పెళ్లి కూతురు,శివ శివ శంకర తదితర నృత్య గీతాలపై విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. సాత్విక,హరిణి,దివ్యశ్రీ, అమృత,నేత్ర,సారిక,అమన్విత,కృష్ణ ప్రియ,హరిణి,సాత్విక, అర్చన, సిరి,సువర్ణ,శ్రీనిక,మనోజ్ఞ మేదజ, భవిష్య, జనన్య తదితరు కూచిపూడి నృత్య గీతాలపై విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు.




# ఆకట్టుకున్న గాయత్రి భజన మండలి భజనలు

శ్రీపాత లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దార్మిక, సాహిత్య, సంగీత సభలో శ్రీ గాయత్రి మహిళా భజన మండలి అధ్యక్షురాలు రచ్చ లక్ష్మీబాయి అధ్వర్యంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి భజనలు చేయడం జరిగింది . సంగీత సభల నిర్వాహకులు ప్రశంసించి సన్మానం చేసి స్వామీ వారి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో చిన్నం భవాని. వంగరి చంద్రకళ రచ్చ హేమలత, బత్తిని వినోద, బబ్బురి ధనలక్ష్మి, ఎక్కలదేవీ నీరజ, రచ్చ స్వరూపరాణి, ముదిగొండ జ్యోతి, కోట సత్యవాణి నల్ల ఉమా రాణి, ఎక్కలదేవి కవిత, కైరంకొండ రమాదేవి, కైరం కొండ లక్ష్మి, దండే శశిరేఖ, ఎర్రం ఉమాదేవి, గంజి భాగ్యశ్రీ, తబలా నారాయణ, తదితరులు పాల్గొన్నారు




# గుట్ట గుడిలో రెండు రోజుల్లో ఇరువురు ఉద్యోగుల సస్పెన్షన్

**యాదగిరిగుట్ట దేవస్థానంలో సస్పెన్షన్ల పరంపర**

**విధులకు గైర్హాజరవడంతో సీనియర్ అసిస్టెంట్ శ్రావ్య సస్పెన్షన్**

**దేవస్థాన డబ్బులు వాడుకున్నందుకు రికార్డు అసిస్టెంట్ నర్సింహారావుపై వేటు**


**మంగళవారం శ్రావ్య, సోమవారం నర్సింహారావుపై చర్యలు**

**రెండు రోజుల్లో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసిన ఈవో భాస్కర్ రావు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉద్యోగులపై సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై ఆలయ ఈవో భాస్కర్ రావు కొరడా ఝులిపిస్తున్నారు. దేవస్థాన డబ్బులు సొంత అవసరాలకు పాల్పడ్డ రికార్డు అసిస్టెంట్ నర్సింహారావును సోమవారం సస్పెండ్ చేసిన ఆలయ ఈవో భాస్కర్ రావు.. మంగళవారం సీనియర్ అసిస్టెంట్ శ్రావ్యపై సస్పెన్షన్ వేటు వేశారు. దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న శ్రావ్య.. గత నాలుగు నెలల నుండి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తరచూ డ్యూటీకి గైర్హాజరు అవుతున్నారు. దీంతో ఈవో భాస్కర్ రావు విచారణకు ఆదేశించారు. విచారణలో సదరు ఉద్యోగి ఇష్టమొచ్చినప్పుడు డ్యూటీకి రావడం, సమాచారం ఇవ్వకుండా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా డ్యూటీకి డుమ్మా కొడుతున్నట్లు ఆఫీసర్లు ఈవోకు నివేదిక సమర్పించారు. దీంతో సదరు సీనియర్ అసిస్టెంట్ శ్రావ్యను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఈవో భాస్కర్ రావు ఆర్డర్స్ పాస్ చేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగుల పట్ల ఈవో చేపడుతున్న చర్యలను స్థానిక భక్తులు స్వాగతిస్తున్నారు. డ్యూటీ పట్ల నిర్లక్ష్యం, అవినీతి, అవకతవకలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటున్న ఈవోను ప్రశంసిస్తున్నారు. ఇక భక్తుల కానుకలతో జీతాలు పొందుతున్న ప్రతి ఆలయ ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని, లేకపోతే ఏ స్థాయి ఉద్యోగికైనా పనిష్మెంట్ తప్పదని ఈవో భాస్కర్ రావు హెచ్చరించారు.

# బైకును కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

## వెడ్డింగ్ కార్డులు పెంచడానికి వెళ్తుండగా ప్రమాదం



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** బైకును వెనుకనుండి కారు ఢీకొనడంతో.. బైక్ పై వెళు_న్న వ్యక్తి అక్కడికక్కడే చనిపోయిన ఘటన మంగళవారం యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట శివారులోని వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై జరిగింది. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కు చెందిన ఎండీ అస్లం(27), ఎండీ ఇబ్రహీం సోహైల్ తో కలిసి బైకుపై వరంగల్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట శివారు ప్రాంతానికి చేరుకోగానే వెనుకనుండి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు.. బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న ఎండీ అస్లం(27) ఎగిరి కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే చనిపోయాడు. బైక్ నడుపుతున్న ఎండీ ఇబ్రహీం సోహైల్ కు తీవ్ర గాయాలు కావడంతో.. హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ కు తరలించి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. ప్రస్తుతం సోహైల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. కూతురు పెళ్లి కార్డులు బంధువులకు ఇవ్వడానికి వెళ్తుండగా ప్రమాదం జరిగి కుమారుడు చనిపోయాడని బంధువులు కన్నీటిపర్యంతం అయ్యారు. మృతుడి తండ్రి ఎండీ సలీం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. కాగా ఇన్నోవా కారు డ్రైవర్ రేణిగుంట శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# గుట్ట గుడి... అద్భుతం గిరిప్రదక్షిణ మహాద్భుతం: ఫిల్మ్ డైరెక్టర్ విజయేంద్రప్రసాద్

## గిరిప్రదక్షిణ చేసిన ఎంపీ, ఫిల్మ్ డైరెక్టర్ విజయేంద్రప్రసాద్



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం అద్భుతంగా ఉంది గిరి ప్రదక్షిణ చాలా చక్కటి అనుభూతినిచ్చింది జై లక్ష్మీనరసింహ జై... జై లక్ష్మీనరసింహ అంటూ ప్రముఖ సినీ నిర్మాత దర్శకులు, రాజ్యసభ సభ్యులు ప్రముఖ దర్శకులు ఎస్.ఎస్ రాజమౌళి తండ్రి అయిన విజయేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి గిరిప్రదక్షిణ చేసిన అనంతరం ఆయన స్వామివారిని దేవస్థానం ఈవో భాస్కరరావుతో కలిసి దర్శించుకున్నారు. విజయేంద్రప్రసాద్ స్వామివారి దర్శనం కోసం మంగళవారం రాత్రి యాదగిరిగుట్టకు వచ్చిన ఆయన.. మొదట కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు కాలినడకన గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం గిరిప్రదక్షిణ విశిష్టత గురించి ఎంపీ విజయేంద్రప్రసాద్ కు ఈవో భాస్కర్ రావు వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన విజయేంద్రప్రసాద్ తనకు గిరిప్రదక్షిణ ఎంతో చక్కటి అనుభూతినిచ్చిందని చెప్పారు ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు అంతేకాకుండా వచ్చే భక్తులందరికీ కూడా మంచి దర్శనాలు కల్పించాలని ఆయన చెప్పారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ క్యాడర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం బొమ్మలరామారం మండలం మైసిరెడ్డిపల్లిలో మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు ఇటీవల పలు పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు తగిన ప్రాధాన్యత ఇస్తూ.. పాత, కొత్త అనే తేడా లేకుండా కలిసికట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమలు చేసిన, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, వచ్చిన మార్పుల గురించి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. ఏడాది కాలంలో బొమ్మలరామారం మండలానికే అధిక నిధులు కేటాయించామని గుర్తుచేసిన ఆయన.. బొమ్మలరామారం మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామన్నారు. వారం వ్యవధిలోనే గోదావరి జలాలతో బొమ్మలరామారం మండలంలోని చెరువులను నింపి రైతుల కష్టాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, మండల మహిళా అధ్యక్షురాలు సునీత, హాజీపూర్ మాజీ సర్పంచ్ కవిత వెంకటేష్ గౌడ్, మండల నాయకులు, పలు గ్రామశాఖ అధ్యక్షులు, అన్ని విభాగాల పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.